
సాక్షి
ఒడిశా

గురువారం । 5 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,112,097లు, బంగారం 1గ్రాము వెండి 126 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆయుర్వేదం ఆచరణీయం

ప్రాచీన వైద్య, చికిత్స విధానాల పునరుద్ధరణ యువతరం బాధ్యత అని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు.

- 4లో



జగన్నాథుని సన్నిధిలో రాష్ట్రపతి

రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీలోని జగన్నాథుడిని బుధవారం దర్శించుకున్నారు.

- 4లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మృతుడు కులిజింగి గ్రామానికి చెందిన మినయాక అప్పలు (55)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జేకే పేపర్ మిల్లుకు కర్రల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులపై ఆందోళన



ఆందోళన చేస్తున్న జయపురం హిందూ జాగరణ మంచ్ శ్రేణులు

జయపురం: బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలపై దాడులు, హిందువులపై హత్యలు, అత్యాచారాలు పెచ్చుమీరుతుండటంపై కొరాపుట్ జిల్లా హిందూ జాగరణ మంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం చలో కొరాపుట్ నినాదంతో వందలాది మంది హిందూ జాగరణ మంచ్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడులను వెంటనే అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వి.కీర్తి వాసన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాగరణ మంచ్ ప్రముఖులు బాబూ బాయి షొడంగి, నిరంజన్ మిశ్ర, హృషికేష్ పాణిగ్రహి, ప్రేమానంద నాయిక్, మనోరంజన్ ప్రధాన్, ముకుంద బెహెరా, రజనీకాంత నాయిక్, అసుధాంశు కుమార్ పాఢీ, మూల్య పాణిగ్రహి, సుభాష్ దత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో వంచించిన యువకుడు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన బినిత్ సబర్

రాయగడ: మాయమాటలు చెప్పి మైనర్ బాలికను గర్భవతిని చేసిన కేసులో పోలీసులు గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని చిన్నారిగుడ గ్రామానికి చెందిన యువకుడు బినిత్ సబర్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రేమిస్తున్నానని బినిత్ సబర్ నమ్మించాడు. అతని మాయమాటలను నమ్మిన ఆమె శారీరకంగా అతనికి దగ్గరైంది. మంగళవారం ఆమె పాఠశాలలో చదువుతున్న సమయంలో అస్వస్థతకు గురైంది. దీంతో ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించగా ఐదు నెలల గర్భిణిగా తేలింది. పోలీసులు బినిత్ సబర్ కేసు నమోదు చేసి.. అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

ధాన్యం కొనుగోలు చైతన్య రథం ప్రారంభం



రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట

రాయగడ: ధాన్యం కొనుగోలుకు సంబంధించి చైతన్య రథాన్ని గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరల గురించి రైతుల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో చైతన్య రథాన్ని ఏర్పాటు చేసినట్టు సబ్ కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు దళారుల బారిన పడి తక్కువ ధరలకు విక్రయించి మోసపోతుంటారని.. అటువంటి వారిలో అవగాహన కల్పించేందుకు ఈ రథం సహకరిస్తుందని వివరించారు. మండీల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో బజారు నియంత్రణ కమిటీ కార్యదర్శి దళపతి కర్జి, ఏఆర్‌సీఎస్ ఇన్‌స్పెక్టర్ సమీర్ కుమార్ స్వయి పాల్గొన్నారు.

మల్కనగిరిలో భూప్రకంపనలు


మల్కనగిరి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7.28 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. సుమారు 5 నుంచి 7 సెకెన్లు భూమి కంపించినట్లు సమాచారం. భయంతో కొందరు ఇళ్లతో బయటకు పరుగులు తీశారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగలేదు.

- ఆకట్టుకున్న నేవీ డే వేడుకలు
- అబ్బురపరిచిన ప్రదర్శనలు
- హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఆకాశ వీధిలో.. అద్భుత విన్యాసాలు




గగనతలంలో యుద్ధ విమానాల విన్యాసాలు



సెల్యూట్ చేస్తూ డ్రోన్ ప్రదర్శన



ఫైటర్ జెట్ ఆకృతిలో..



నేవీ లోగో..







ఆకట్టుకున్న హెలికాప్టర్ విన్యాసాలు

ఓ వైపు సముద్రుడి హోరు.. మరోవైపు యుద్ధ విమానాల జోరు.. కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతులతో పైలట్ల విన్యాసాలు.. ఈ అద్భుత ఘట్టానికి పూరీ బ్లూఫ్లాగ్ సాగర తీరం వేదికగా మారింది. నావిక సేన పరాక్రమ ప్రదర్శన తిలకించేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యక్షంగా హాజరయ్యారు. బుధవారం సాయంత్రం 4.07 గంటల నుంచి 5.24 గంటల వరకు ఈ విన్యాసాల ప్రదర్శన నిరవధికంగా కొనసాగింది. 15 యుద్ధ ఓడలు, 40 ఎయిర్ క్రాఫ్టుల విన్యాసాలు అదరహో అనిపించాయి. ఐఎన్ఎస్ జల్సా, మిసైల్, డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ సూర్య, ఐఎన్ఎస్ సూర్య, ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ సతొపురా వంటి ప్రముఖ యుద్ధ ఓడలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. హాక్, సీ – కింగ్, మిగ్ – 29 వంటి ఫైటర్ జెట్లు, చేతక్, ఎంఎస్ 60 హెలికాప్టర్లు విన్యాసాలు ప్రదర్శించాయి. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన నావికా యుద్ధ విన్యాసాల ప్రదర్శనకు రాష్ట్ర శాసనసభ్యులతో పాటు వేలాది జనం హాజరై కనులారా తిలకించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పూరీ పట్టణ వ్యాప్తంగా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– భువనేశ్వర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి



నావికా దినోత్సవం వేడుకలో రాష్ట్రపతి, ప్రముఖులు

నేవీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి: రాష్ట్రపతి

భువనేశ్వర్: మాతృభూమి రక్షణలో నావికా దళ సిబ్బంది సేవలు నిస్వార్థమైనవని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 2047 నాటికి స్వతంత్ర భారత దేశం శతాబ్ది పూర్తి పురస్కరించుకుని వికసిత్ భారత్‌గా వెలుగొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నావికా రంగంలో నారీ శక్తి బలోపేతం అభినందనీయమని కొనియాడారు. అధునాతన సాంకేతికత, వ్యూహాత్మక చతురత, పరిపూర్ణ ధైర్య సాహసాలు, ఏకీకరణ భారత నావికా దళం దేశ భద్రతకు విశ్వసనీయతని తీసుకొచ్చాయని పేర్కొన్నారు.

కిటకిటలాడిన సాగర తీరం

నావికా దినోత్సవం విన్యాసాల్ని కనులారా తిలకించేందుకు విశేష సంఖ్యలో ప్రేక్షకులు తరలి వచ్చారు. రాష్ట్రపతితో పాటు గవర్నరు రఘుబర దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, మంత్రి మండలి సభ్యులు, శాసన సభ్యులు, నేవల్ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, సైనిక ప్రముఖులు హాజరయ్యారు.



కిటకిటలాడిన పూరీ బ్లూ ఫ్లాగ్ సాగర తీరం పరిసరాలు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



వేదికపై పోలీసు అధికారి అంకిత కుమార్‌వర్మ తదితరులు

- వార్షిక క్రీడా పోటీలు ఆరంభం

జయపురం: స్థానిక మోడరన్ ఇంగ్లిష్ పాఠశాల వార్షిక క్రీడా పోటీలు స్థానిక విక్రమ క్రీడా మైదానంలో బుధవారం జరిగాయి. పరుగు, కబడ్డీ, ఖోఖో, రిలే, బ్యాడ్మింటన్, ఒన్‌లెగ్ రేస్(ఒంటి కాలు పరుగు), బ్యాలన్సింగ్ రేస్, ఫ్రాగ్ జప్ (కప్ప గెంతులు) మొదలగు పోటీలు నిర్వహించగా పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ప్రత్యేకంగా మ్యూజికల్ చైర్, ఒన్ లెగ్ రిలే పోటీలు నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు కిశోర్‌కుమార్ హోత్త అధ్యక్షతన జరిగిన క్రీడా ఉత్సవాలలో జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దీప ప్రజ్వలన చేసి పతాకాన్ని చూపి క్రీడా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలు చదువులో అంతర్ భాగం కావాలని అన్నారు. చదువు విద్యార్థులకు విజ్ఞానం అందిస్తే క్రీడలు శారీరక, మానసిక వికాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని ప్రతిభను కనబర్చాలన్నారు. పాఠశాల కార్యదర్శి నయణ కిశోర్ మహంతి, డైరెక్టర్ కుముది మాల మహంతి, ప్రిన్సిపాల్ సుప్రియ పాణిగ్రహి, ఉపాధ్యక్షులు సచిదానంద మహాపాత్ర, అజమల్ బేగ్, నిరంజన్ పాణిగ్రహి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలకు ముఖ్యఅతిథి వర్మ బహుమతులు ప్రదానం చేశారు.



మ్యూజికల్ చైర్ పోటీలో విద్యార్థుల తల్లిదండ్రులు

వినియోదారుల సేవలో విద్యుత్ శాఖ

- మల్కన్‌గిరిలో డ్రోన్ సేవలు ప్రారంభం



డ్రోన్ సేవలను ప్రారంభిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని వినియోగదారులకు మరిన్ని సేవలను టీపీఎస్‌వోడీఎల్ విద్యుత్ సంస్థ ప్రారంభించింది. సకాలంలో వినియోగదారులకు సేవలందించే విధంగా ప్రప్రథమంగా డ్రోన్ సేవలను ప్రారంభించింది. డ్రోన్ సహాయంతో జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత శాఖ కార్యాలయానికి సమాచారం అందిస్తుంది. దీంతో సిబ్బంది అప్రమత్తమై ఆయా ప్రాంతాని వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం, తీగలు తెగి పడటం వంటి సమస్యలను డ్రోన్ గుర్తించి వెంటనే తెలియజేస్తుంది. వర్షాకాలంలో అత్యధికంగా ఇటువంటి సమస్యలు తలెత్తుతుండటం పరిపాటిగా గమనించిన విద్యుత్ విభాగం ఈ డ్రోన్ సహాయంతో సమస్యలను సులభతరంగా కనుగొనే అవకాశం కలుగుతుందని మల్కన్‌గిరి విద్యుత్ విభాగం ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఆశీస్ జెన్న తెలిపారు. ఈ డ్రోన్ సుమారు పది కిలోమీటర్ల వరకు ఎగిరి సుమారు 120 అడుగుల పైనుంచి సమస్యలను పసిగడుతోందని చెప్పారు.

గుణుపూర్‌లో ఇడితాల్ ఉత్సవాలు

- 20 నుంచి గుణుపూర్‌లో మూడు రోజులు సాంస్కృతిక ప్రదర్శనలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. మూడు రోజులు జరగనున్న ఉత్సవాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి పట్టణ ప్రముఖులతో బుధవారం సమావేశమయ్యారు. జీఐఈటీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ చంద్ర ధ్వజ పండ, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు బిజయ కుమార్ గొమాంగో, గుణుపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడొ తదితర ప్రముఖులు సమావేశంలో పాల్గొన్నవారిలో ఉన్నారు. గతంలో రెండు రోజులు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవాలను ఈసారి మూడు రోజులు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పట్టణ ప్రముఖులు కోరగా అందుకు కలెక్టర్ అంగీకరించారు. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని లంజియా సౌర తెగకు చెందిన ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఈ ఉత్సవాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.



సమావేశంలో కలెక్టర్ పట్వారి, గొమాంగో, చంద్ర ధ్వజ పండ, గౌడొ తదితరులు

ఘంటసాలకు ఘన నివాళులు

పర్లాకిమిడి: తెలుగు చలనచిత్ర గానగాంధర్వుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతిని స్థానిక పాతపట్నం రోడ్డులోని ఘంటసాల విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. పాతపట్నం మాస్టారు పారిశెల్లి రామరాజు ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైతన్య సమితి కార్యదర్శి బర్నాల జనార్ధనరావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో 40 వేలకు పైగా పాటలు పాడి ప్రపంచ ఖ్యాతి సాధించిన మహనీయుడు ఘంటసాల అని కొనియాడారు. కార్యక్రమంలో ఇసై వెంకటరావు, మురళీ బెహరా, పండా ఘంటసాల గీతాలను ఆలపించి అభిమానులను అలరించారు.



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేస్తున్న చైతన్య సమితి సభ్యులు

క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఉపాధ్యాయులు

జయపురం: జయపురం సమితి అసన గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు దుస్తులను దిగాపూర్ మా వైష్ణవీ స్వయం సహాయక గ్రూప్ సభ్యులు సమకూర్చారు. ఒక్కొక్కరికీ రెండు జతల చొప్పున 292 మందికి అందజేశారు. హెచ్‌ఎం ప్రగతి జెన, పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు దుర్గో హరిజన్, వార్డు మెంబర్ పదమ శాంత, పరిచాలన కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న వలస కార్మికులు



వచ్చిన వలస కార్మికులు వీరే

రాయగడ: గుజరాత్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో కూలి పనులకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న 9 మంది వలస కార్మికులను జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని వారిని స్వగ్రామానికి రప్పించింది. వీరు ఆరుగురు జిల్లాలోని బిసంకటక్ ప్రాంతానికి చెందిన వారు కాగా మిగతా ముగ్గురు కాసీపూర్ ప్రాంతానికి చెందినవారు. కొద్ది నెలలుగా అక్కడ పడుతున్న ఇబ్బందులకు సంబంధించి వాట్సాప్‌లో పోస్టు చేయడంతో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి వారిని తిరిగి తీసుకువచ్చేందుకు చొరవ తీసుకున్నారు. గుజరాత్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి కార్మికులకు విముక్తి కలిగించారు. బుధవారం రాయగడకు చేరుకున్న వలస కార్మికులు కలెక్టర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

29 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: రాయగడ సమితి సేవక్‌పూర్ పరశురామ్ డిగ్రీ కళాశాలలో సంబాద్ అమొఒడిశా సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు ప్రదీప్ కుమార్ బిశోయి ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యదర్శి సింహాద్రి ప్రభాకర్‌రావు, ప్రధాన ఆచార్యులు కలక తాడు పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో సుమారు 29 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు తరలించారు. కార్యక్రమంలో సంబాద్ పత్రిక ప్రతినిధి బసంత్ కుమార్ పండా, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ ఖగేశ్వర బెహెరా, యూత్ రెడ్ కౌన్సిలరు భాగ్యభుయ్యాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మేకలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం రైలు ఢీకొని 7 మేకలు మృతి చెందాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లింగాలవలస గ్రామానికి చెందిన లండ అప్పారావు అనే వ్యక్తి తన మేకలను రైలు పట్టాలు పక్కగా తీసుకెళ్తుండగా, అదే సమయంలో గుణుపూర్ నుంచి రౌర్కెలా వైపు వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 7 మేకలు మృతి చెందినట్లు తెలిపారు. తన మేకలు మృతి చెందడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గొట్టిపల్లి శ్యామ్యూల్ మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామానికి చెందిన వృద్ధుడు గొట్టిపల్లి శ్యామ్యూల్(60) బుధవారం సాయంత్రం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు దవిడిగాం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొసమాల గ్రామానికి చెందిన సానాపురం గంగధర్, గొట్టిపల్లి శ్యామ్యూల్ ఇద్దరూ కలిసి బుధవారం సాయంత్రం పర్లాకిమిడి(ఒడిశా) వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఒక ప్రైవేటు బస్సును ఢీ కొన్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే గొట్టిపల్లి శ్యామ్యూల్ మృతి చెందగా, గంగధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గంగధర్‌ను పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం ఆటోలో తరలించారు. ఒడిశా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేదం ఆచరణీయం

- ప్రాచీన వైద్య, చికిత్స విధానాల పునరుద్ధరణ యువతరం బాధ్యత
- గోపబంధు ఆయుర్వేద విద్యాలయం వజ్రోత్సవంలో రాష్ట్రప్రతి ద్రౌపతి ముర్ము



ఆయుర్వేద విద్యాలయం వజ్రోత్సవ జ్ఞాపిక సంచిక ఆవిష్కరించిన రాష్ట్రపతి, ప్రముఖులు

భువనేశ్వర్: భారతీయ ఆయుర్వేదానికి విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని, యువతరం మరింత ఉత్సాహంతో పరిశోధనలు చేసి మరుగున పడిన కీలక ఆయుర్వేద వైద్య విధానాల్ని వెలుగులోకి తేవాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. బుధవారం పూరీలోని గోపబంధు ఆయుర్వేద విద్యాలయం వజ్రోత్సవం వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమతుల్య ఆహార అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు తొలి సోపానమని పేర్కొన్నారు. యోగా అభ్యాసం, సాధన శారీరిక రుగ్మతల్ని నియంత్రించడంలో దోహదపడుతుందన్నారు. సంప్రదాయ వైద్యం, చికిత్స విధానాల ఆచార వ్యవహారాల్ని యువతరం సాధారణ జన స్రవంతికి అలవరచడం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మరుగున పడిన ఆదివాసీ సంప్రదాయ సహజ వైద్య విధానాల పరిరక్షణకు పరిశోధనలు చేయాలన్నారు. తాళపత్ర గ్రంథాల్లో ప్రాచీన వైద్య, చికిత్స విధానాలకు సంబంధించిన విశ్వసనీయ ఆధారాలు అందుబాటులో ఉన్నట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. సంగ్రహాలయాలతో పలువురు దళిత వర్గాల పెద్దల అధీనంలో ఈ సంపద నిక్షిప్తంగా ఉందని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ గణపత్ రావ్, రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితరులు పాల్గొన్నారు.



మేధా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో రాష్ట్రపతి

సంగీత పోటీలు ప్రారంభం



వేదికపై మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి, తదితరులు

జయపురం: కొరాపుట్ పర్వ్ 2024 ఆదివాసీ మహోత్సవాల సందర్భంగా జయపురం టౌన్ హాల్‌లో జిల్లా స్థాయి సంగీత పోటీలు ప్రారంభమయ్యాయి. కొరాపుటియ కళ, కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంగీత పోటీలను జయపురం మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కతిబాస్ నాయక్, జయపురం సమితి అదనపు బీడీఓ మరోజ్ కుమార్ నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. జిల్లాలో అన్ని సమితుల నుంచి, పురపాలక పరిషత్ ప్రాంతాల నుంచి అనేకమంది సంగీత కళాకారులు పాల్గొన్నారు. సంగీత పోటీల న్యాయ నిపుణులుగా గాయకుడు బిద్యుత్ ప్రభ పట్నాయక్, తపలీ వాయిద్యకారుడు సుకాంత అధికారి, కంఠ శిల్పి ఝతాదారి దొలాయి పాల్గొన్నారు. కొరాపుటియ గీత పోటీల న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ గాయకుడు అబుదూల్ ఖాదర్, సంగీత డైరెక్టర్ హేమంత కుమార్ మిశ్ర, సినీ సంగీత డైరెక్టర్ అమర కుమార్ మిశ్ర హాజరయ్యారు. జిల్లా స్థాయి సంగీత పోటీల్లో వాయిద్య కారుడు మహేశ్వర నాయక్, రమేష్ పాణిగ్రహి, శుకమన్ సాగరిక, పియూష్ పట్నాయక్‌లు సహకరించారు. శ్రీకాంత దాస్ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



సంగీత పోటీల్లో పాల్గొన్న బిరేష్ పట్నాయక్

జగన్నాథుని సన్నిధిలో రాష్ట్రపతి



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గజపతి మహారాజా, శ్రీ మందిరం సీఏఓ

భువనేశ్వర్: రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీలోని జగన్నాథుడిని బుధవారం దర్శించుకున్నారు. శ్రీ మందిరం సింహద్వారం ఆవరణకు అనుసంధానపరిచే బొడొ దండొ మార్గంలో కాలి నడకన చేరారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేశారు. సింహద్వారం ఆవరణలో పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్, శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢికి సాదరంగా స్వాగతం పలికారు. ముప్పావు గంట సేపు శ్రీ మందిరం రత్న వేదికపై మూల విరాటుల్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా.. సాధారణ భక్తులకు సర్వ దర్శనాన్ని తాత్కాలికంగా నియంత్రించారు.



జగన్నాథుని దర్శించుకున్న రాష్ట్రపతి, ముఖ్యమంత్రి

పొలంలో హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

భువనేశ్వర్: మయూరభంజ్ జిల్లా అమర్దా గ్రామ సమీపం పంట పొలంలో ఇండియన్ నేవీ హెలికాప్టర్ ఆకస్మికంగా ల్యాండ్ అయ్యింది. బుధవారం చోటు చేసుకున్న ఈ సంఘటన గ్రామస్తుల్ని భయభ్రాంతులకు గురి చేసింది. సాంకేతిక సమస్యల కారణంగా ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు పావు గంట తర్వాత సమస్య పరిష్కారం కాకపోవడంతో తిరిగి గాలిలోకి ఎగిరిందని స్థానిక పోలీస్ సూపరింటెండెంట్ వరుణ్ గుంటుపల్లి తెలిపారు.

ఆకట్టుకున్న స్వర నీరాజనం



ఘంటశాల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాయగడ: ఘంటశాల జయంతిని పురస్కరించుకుని స్థానిక రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వరనీరాజనం కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యదర్శి డాక్టర్ పతివాడ తులసీదాస్, సాంస్కృతిక విభాగం కార్యదర్శి కేకేఎం పట్నాయక్, సహ కార్యదర్శి బాల కృష్ణ పట్నాయక్ తొలుత ఘంటశాల చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం అమర గాయకుడి పాటలను వీనుల విందుగా ఆలపించారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



అవగాహన కార్యాక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రాలోని బిజూ పట్నాయక్ స్నాతక కళాశాలలో నిశా నివారణ సచేతన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జాతీయ సేవా యోజన, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. కుంద్రా తహసీల్దార్ బినోద్ కుమార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. చెడు వ్యసనాలతో అనేక కుటంబాలు వీధిన పడుతున్నాయన్నారు. మందు, సారా తాగి అనేక మంది మృతి చెందుతున్నారన్నారు. నిశా అనే మహమ్మారికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామం సారాముక్తిగా మారాలని, అందుకు సచేతన కార్యక్రమాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హృదయ రంజన్ పండా, కొరాపుట్ సాహిద్ లక్ష్మణ నాయక్ వైద్యకళాశాల ఎన్‌సీడీసీఎల్ అధికారి సతీష్ కుమార్ త్రిపాఠీ, జాతీయ సేవాయోజన జిల్లా కోఆర్డినేటర్ సంజయ కుమార్ బెహరా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అజయ కుమార్ నాయక్ ప్రథమ, ప్రద్యూష్ దాస్ ద్వితీయ, అనిల్ హరిజన్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

నలుగురు హాస్టల్ విద్యార్థులు పరార్



ముకుందపూర్ హాస్టల్

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి ముకుందపూర్‌లో ప్రభుత్వ ఉన్నత విద్యాలయం వసతి గృహంలో చదువుతున్న నలుగురు విద్యార్థులు మంగళవారం పరారయ్యారు. విషయం తెలుసుకున్న సిబ్బంది వెతికి పట్టుకుని తిరిగి హాస్టల్లో చేర్పించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు మంగళవారం ఎవ్వరూ లేని సమయం చూసి గోడ దూకి బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సిబ్బంది హాస్టల్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న భొయిముడ గ్రామ సమీపంలో పట్టుకున్నారు. తిరిగి హాస్టల్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. హాస్టల్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, నిర్వాహకులు నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

• మాజీ రాష్ట్రపతికి శ్రద్ధాంజలి



భారత పూర్వ రాష్ట్రపతి ఆర్.వెంకట రామన్ జయంతి పురస్కరించుకుని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం రాజ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. – భువనేశ్వర్

నిర్లక్ష్య ధోరణితో ప్రతిష్టకు భంగం

- విచారణ చేపట్టిన ఏసీ ప్రసాద్ పట్నాయక్

టెక్కలి: ఎంతో పవిత్రమైన రావివలస ఎండల మల్లన్న దేవాలయ ప్రతిష్టకు భంగం కలిగేవిధంగా దేవదాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కార్తీక మాసోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలిగేలా తప్పిదాలు చేశారని బీజేపీ కార్యకర్తలు ఎస్.లక్ష్మీనారాయణ, సీహెచ్ లింగరాజు, జె.పరమేశ్వరరావు, జనసేన కార్యకర్త జనార్దన్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మల్లన్న సన్నిధిలో జరిగిన కార్తీక మాసం సోమవారం ఉత్సవాల్లో భాగంగా టికెట్లు, ఉచిత ప్రసాదాల పంపిణీలో చోటు చేసుకున్న తప్పిదాలపై పలు పత్రికల్లో కథనాలు, భక్తుల ఫిర్యాదుల మేరకు దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్‌తో పాటు ఇతర అధికారులు ఆలయంలో బుధవారం విచారణ చేపట్టారు. ప్రతిఏటా ఎంతో వైభవంగా జరిగే కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది భక్తులకు కనీసం ప్రసాదాలు సైతం అందివ్వలేని విధంగా ఉత్సవాలను నిర్వహించారని ఫిర్యాదుదారులు మండిపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలు లేకపోవడంతో ఎంతో అసహనంగా వెనుదిరిగారని గుర్తు చేశారు. విచారణలో అధికారులు అన్ని వర్గాల నుంచి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, ప్రభాకరరావు, కోదండ, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, వీఆర్వో ఆర్.అప్పన్న, అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న దేవదాయ శాఖ అధికారులు

మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

కాశీబుగ్గ: మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కొండలోగాం సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ అధికారి డి.రవిశంకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి సవర ఫల్గుణరావు, నాయకులు సవర బాలకృష్ణ, జయరాజ్, నరసింహ, ప్రజా సంఘాల నాయకులు తెప్పల అజయ్‌కుమార్, నెయ్యిల గణపతి, కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవును చంపిన పెద్దపులి!

- అంధారీ జోల్లా గ్రామంలో ఘటన
- ప్రజలను అప్రమత్తం చేసిన అటవీ అధికారులు

పర్లాకిమిడి: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో తిరుగుతున్న పెద్ద పులి బుధవారం ఉదయం గజపతి జిల్లా గారబంద పంచాయితీ అంధారీజోల్లా గ్రామంలో ఆవుపై దాడి చేసి చంపేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న దేవగిరి రేంజ్ అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అటవీ ప్రాంతాన్ని సందర్శించి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. గారబంద, రంప అటవీ ప్రాంతంలో పులిని ట్రాక్ చేసేందుకు కెమెరాలు అమర్చామని డీఎఫ్‌వో ఎస్.ఆనంద్ 'సాక్షి'కి చెప్పారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గారబంద అటవీ రేంజ్ అధికారులు పులిపాదముద్రల ఫొటోలు, అడుగుజాడలు సేకరించారు. పులి సంచారంపై గారబంద పరిసర గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేశారు. చీకట్లో తిరగవద్దని, కోళ్లు, మేకలు, పశువులను ఇళ్లవద్దే ఉంచాలని హెచ్చరికలు జారీ చేసినట్టు జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్ తెలిపారు.



అంధారీ జోల్లా గ్రామంలో పర్యటిస్తున్న అటవీశాఖ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు



గారబందలో పులి అడుగుజాడలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు



ఆవును చంపిన పెద్దపులి అడుగును పరిశీలిస్తున్న వెటర్నరీ వైద్యులు



పెద్ద పులి అడుగుజాడలు



అంధారీజోల్లా గ్రామంలో అటవీ సిబ్బంది

క్లుప్తంగా

పోలీసు కుటుంబానికి చేయూత



షేక్ పర్వీన్ నిషాకు చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేసి, ఇటీవల మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత నందించేందుకు పోలీస్‌సిబ్బంది పోగు చేసిన మొత్తాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ బాబా అనారోగ్య కారణాలతో సెప్టెంబరు 24న మృతిచెందారని, వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీసు సిబ్బంది పోగుచేసిన రూ. లక్షా 47వేల 900 చెక్‌ను మృతుడి సతీమణి షేక్ పర్వీన్ నిషాకు అందజేశామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపడతామని, వెంటనే దరఖాస్తు చేయాలని, ఇతర ధ్రువీకరణ పత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని బాధిత కుటుంబానికి సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు

గరుగుబిల్లి: ఏలూరు జిల్లా పెదవేగిలో నిర్వహించిన జోనల్ రాష్ట్రస్థాయి పోటీల్లో గరుగుబిల్లిలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ విభాగం వాలీబాల్‌లో ద్వితీయస్థానం, జావెలిన్‌త్రోలో ప్రథమ, తృతీయ స్థానాలను ఇద్దరు విద్యార్థినులు కైవసం చేసుకున్నారని చెప్పారు. అలాగే 100మీటర్ల రిలేలో ప్రథమ స్థానాన్ని షాట్‌పుట్ విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాలను కై వసం చేసుకోవడంతో పాటు 400మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానం సాధించినట్లు వివరించారు. జూనియర్స్ విభాగంలో జావెలిన్ త్రోలో తృతీయ స్థానం పొందినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థినులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచడం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ పి. వెంకటరత్నం, పీఈటీ ఐ.యమున, పాఠశాల సిబ్బంది వారిని అభినందించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సంగీత స్వరార్చన చేస్తున్న గాయనీ,గాయకులు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో శతాబ్దిగాయకుడు, పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 12 గంటల పాటు నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం అలరించింది. ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు సారథ్యంలో గాయనీ,గాయకులు అలనాటి మధుర గీతాలను ఆలపించి ఆహూతులను ఆకట్టుకున్నారు. తెలుగు ఇండియన్ ఐడల్ మ్యూజిక్ టీమ్ ఎం.సాయికుమార్, పవన్ కుమార్‌ల నేతృత్వంలో సంగీత సహకారం అందజేశారు. ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ వయొలనిస్ట్ కామాక్షి అద్భుతమైన ప్రదర్శన చేశారు. అదేవిధంగా బాలల ప్రత్యేక సంగీత విభావరిలో చిన్నారులు ఘంటసాల పాటలు పాడి చూపరులను కట్టిపడేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డాక్టర్ జి.సన్యాసమ్మ, ఎం.కుమారస్వామి, సాయంత్రం సభలో గ్రంధి విష్ణుమూర్తి, ధవళ సర్వేశ్వరరావు, వైవీవీ.సత్యనారాయణ (అబ్బులు), ఏగిరెడ్డి తిరుపతినాయుడు, కాపుగంటి ప్రకాష్, అధిక సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

వంగర: మండలంలోని కోదులగుమ్మడ గ్రామ సమీపంలో మలుపు వద్ద బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఆ వాహనాలతో ప్రయాణం చేస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాల పాలయ్యారు. కళ్లికోట గ్రామం నుంచి కోదులగుమ్మడ గ్రామానికి వస్తున్న బైక్, కంబర గ్రామం నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న మరో బైక్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రకాష్‌రావు, అప్పలనాయుడులకు గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా వాహనం వచ్చి బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పార్వతీపురంలోని ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తరలించింది. వారిద్దరికీ సకాలంలో ప్రాథమిక చికిత్సను అందించిన ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పిందని, బాధితులు కోలుకుంటున్నారని హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి.

కిడ్నీ బాధితుల కంటకన్నీరు..!



ఏరియా ఆస్పత్రిలో తన కష్టం వివరిస్తున్న కిడ్నీ బాధితుడు అప్పన్న, భార్య తవిటమ్మ

పై చిత్రంలో కనిపిస్తున్న సవర అప్పన్న కిడ్నీ బాధితుడు. ఈయనది శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి మహాసింగి గ్రామం. ఈయనకు మగబిడ్డలు లేరు. ఉన్న ఆడబిడ్డకు వివాహం కావడంతో వృద్ధురాలైన భార్య తవిటమ్మతో కలిసి కూలిపని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈయన కిడ్నీ మహమ్మారి బారిన పడ్డాడు. వారంలో మూడుసార్లు పాలకొండ వచ్చి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకోవాలి. గతంలో 108లో వచ్చిన ఈయన ప్రస్తుతం దాదాపు 40 కిలోమీటర్ల దూరం నుంచి భార్య సాయంతో వేకువజామున లేచి, ఆటోల సాయంతో ఆస్పత్రికి వస్తున్నాడు. రూ.50 చార్జీకి బదులు ఆటోలకు రూ.8వందలు వంతున వారంలో మూడుసార్లు చెల్లించలేకపోతున్నామని వాపోతున్నాడు.



ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్న బాధితులు

- అందుబాటులో లేని అపర సంజీవని
- ప్రైవేట్ వాహనాలకు ఖర్చు చేయలేకపోతున్నామంటూ ఆవేదన
- సర్కారు కఠిన నిర్ణయంతో రోగుల పాట్లు

పాలకొండ రూరల్: ప్రభుత్వ సూచనలతో ఆరోగ్యశ్రీ ట్రస్టు తీసుకున్న నిర్ణయాలతో సర్కారు తీరు పలు ఆరోపణలు, తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కూటమి ఆనాలోచిత నిర్ణయాలు సామాన్యులను అవస్థల పాలు చేస్తున్నాయి. తాజాగా 108 విధివిధానాల్లో కొన్ని మార్పులను ప్రభుత్వం తీసుకువచ్చింది. వాటి నిర్వహణ ఖర్చును క్రమబద్ధీకరించేందుకు చేసిన కిడ్నీ రోగుల పాలిట యమపాశంలా మారింది. గడిచిన ఐదేళ్ల పాలనలో కిడ్నీ బాధితులకు నాటి జగన్ సర్కార్ అండగా నిలిచింది. ఆ బాధితులకు రూ.10వేల పింఛను అందించడంతో పాటు మెరుగైన ఉచిత వైద్య సేవలు కొనసాగించింది. గతంలో డయాలసిస్ చేయించుకునేందుకు ఆస్పత్రులకు వెళ్లే బాధితుల ఇళ్ల వద్దకు 108 సేవలు కొనసాగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో రోగులు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చేతి సొమ్ము పెట్టుకుని, అపసోపాలు పడుతూ ఆస్పత్రికి చేరుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఏ బాధితుడిని కదిపినా దూరాభారం నుంచి అధిక మొత్తం చెల్లించి, వ్యయ ప్రయాసలకోర్చి ఆస్పత్రులకు వస్తున్నామని చెబుతున్నారు.

ఐదు నెలల క్రితం ఇంటి వద్దకే..

ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ డివిజన్‌తో పాటు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని కొన్ని మండలాలకు చెందిన ప్రజలకు పాలకొండ ఏరియా ఆస్పత్రి పెద్దదిక్కు. ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఉండడంతో ఈ మూడు జిల్లాలకు చెందిన కిడ్నీ బాధితులు దాదాపు 95 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. బాధితుల్లో కొంతమంది 3 రోజులకోసారి, మరికొందరు వారానికోసారి, నెలకు రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని 18 మండలాలకు చెందిన కిడ్నీ బాధితులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి రావాల్సి ఉంటుంది. గడిచిన ఐదు నెలల క్రితం వరకూ సంబంధిత బాధితులు తమ ఇళ్ల నుంచి 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి వచ్చి డయాలసిస్ చేయించుకుని తిరిగి అదే వాహనంలో ఇంటికి వెళ్లేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం 108 అంబులెన్సులను డయాలసిస్ బాధితుల సౌకర్యార్థం పంపించడం కుదరదని నిర్ణయం తీసుకుంది. దీంతో కొద్ది రోజులుగా ఈ వాహనాలు రావడం లేదని బాధితులు చెబుతున్నారు.

కొనసాగుతున్న 108 కష్టాలు..

కూటమి సర్కారు అధికారం చేపట్టిన నాటి నుంచి 108 కష్టాలు కొనసాగుతున్నాయి. నిర్వహణకు నిధులు విడుదల చేయపోవడం, వాహనాలు మరమ్మతులకు గురికావడం, డీజిల్ ఖర్చు తగ్గించే క్రమంలో తీసుకుంటున్న నిర్ణయాలు, సిబ్బందికి జీతాలు సక్రమంగా ఇవ్వక పోవడం వంటి సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో సదరు సిబ్బంది దాదాపు నెల రోజుల నిరసన బాట పట్టారు. రెండు విడతల్లో జరిగిన చర్చలతో ప్రస్తుతం వీరు సమ్మె చేపట్టాలన్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. గతంలో జగన్ సర్కారు ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్టిలో పెట్టుకుని మండలానికి రెండు వాహనాలు ఏర్పాటు చేసి ప్రతి రోగికి వెన్నుదన్నుగా నిలిచింది. ఇటీవల అత్యవసర కేసులకు కూడా సకాలంలో వాహనాలు రావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కిలోమీటరు దూరానికి రూ.2 వందలు..

నాపేరు కుమ్మరి చిన్నారావు. మాది పాలకొండ మండలం వెలగవాడ గ్రామం. రోజు కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. నిరుపేదనైన నన్ను కిడ్నీ రోగం బాధిస్తోంది. వారంలో మూడు రోజుల పాటు డయాలసిస్ చేయించుకోవాలి. గతంలో 108లో వచ్చి వైద్య సేవలు పొంది తిరిగి ఆదే వాహనంలో ఇంటికి చేరుకునే వాడిని. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మమ్మల్ని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు 108 రావడం లేదు. ఆదేమంటే రూల్స్ మార్చారని చెప్పి ఫోన్ పెట్టేస్తున్నారు. చేసేది లేక ఆటోల్లో వస్తున్నాను. మా ఇంటి నుంచి ఆస్పత్రికి ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది. ఆటో వాళ్లు రూ.200 అడుగుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని స్థితి మాది. వారానికి రూ.ఆరు వందలు, నెలకు రూ.2,400 ఆటోలుకు ఖర్చు చేయడం కష్టంగా ఉంది. మా సమస్యలు గుర్తించి 108 సేవలు మళ్లీ మాకు అందుబాటులోకి తేవాలి.



కుమ్మరి చిన్నారావు
కిడ్నీ బాధితుడు, వెలగవాడ గ్రామం, పాలకొండ మండలం

రూ.2,500 ఖర్చు చేయాల్సి వస్తోంది



సహాయకురాలు కమలమ్మతో తలసముద్రం రాజారావు. డయాలసిస్ పేషెంట్, పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా

నాపేరు తలసముద్రం రాజారావు. మాది శ్రీకాకుళం జిల్లా పాతపట్నం దరి. నేను డయాలసిస్ కోసం వారానికి మూడుసార్లు పాలకొండ ఏరియా ఆస్పత్రికి రావాల్సి ఉంది. మా స్వగ్రామం నుంచి దాదాపు రెండు గంటలు ప్రయాణం చేయాలి. గతంలో 108 సాయంతో వచ్చి వెళ్లేవాడిని. తాజాగా 108 సేవలు నిలుపుదల చేయడంతో సరైన సమయానికి ఆస్పత్రికి వచ్చేందుకు రూ.2,500 చెల్లించాల్సి వస్తోంది. ఈ బారం భరించ లేకపోతున్నాం. నాతో వచ్చే సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా మూడుసార్లు రావాలంటే వారానికి రూ.7,500. నెలకు రూ.20వేలు వరకు ఖర్చు చేయాలి. అంత భారం ఎలా మోయగలం. తిరిగి అంబులెన్స్ సేవలు పునరుద్ధరించాలి.

చక్కెర ఫ్యాక్టరీ వ్యర్థాలతో ఇబ్బందులు

- గ్రామస్తుల ఆందోళన




ఆందోళనకారులకు నచ్చజెపుతున్న పోలీసులు

రేగిడి: మండలంలో ఏర్పాటు చేసిన సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం వ్యర్థపదార్థాలతో ఇబ్బందులు కలుగుతున్నాయని మండలంలోని పుర్లి గ్రామస్తులు ఫ్యాక్టరీ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ పక్క నుంచి తమ గ్రామానికి బీటీ రహదారి ఉందని, ఈ రహదారి మీదే ఫ్యాక్టరీ వ్యర్థాలు, చెత్తాచెదారం కుప్పలుగా పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులతో పాటు ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫ్యాక్టరీ యాజమాన్యం వాటిని తొలగించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మండల శానిటేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి, ఫ్యాక్టరీ యాజమాన్యంతో వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న రేగిడి పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో పాటు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని పిలిపించి, వ్యర్థాలు తొలగించాలని సూచించారు.

హర్యానాలో కబడ్డీ పోటీలకు అనూరాధ

- 7 నుంచి జాతీయస్థాయిలో అండర్-19 స్కూల్‌గేమ్స్ పోటీలు



జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైన అనూరాధ

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ పోటీలకు విజయనగరానికి చెందిన ఎస్.అనూరాధ అర్హత సాధించింది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణి ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్న అంతర్‌రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. నగరంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న అనూరాధ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని, అక్కడ కూడా సత్తా చాటి విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని వ్యాయామ ఉపాధ్యాయిని సౌదామిని ఆకాంక్షించారు. అనూరాధ ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఎర్రచందనం అమ్మకాల ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం



అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, ఎమ్మెల్యేల బేబీ నాయనను సత్కరిస్తున్న దృశ్యం

బొబ్బిలి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎర్రచందనం వేలం అమ్మకాల ద్వారా అటవీ కార్పొరేషన్‌కు ఆదాయం లభిస్తోందని చైర్మన్ ఆర్‌వీఎస్‌కే రంగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన బొబ్బిలి కోటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విదేశాల్లో ఎర్రచందనానికి మార్కెట్ మందకొడిగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాఖకు సంబంధించి ఆయనతో చర్చించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తామన్నారు. అడవుల్లో వాణిజ్య పంటలకు గిట్టుబాటు వ్యాపారం జరిగేలా నీలగిరి, కాఫీ తదితర పంటలను సాగు ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎర్రచందనం విక్రయాలకు ఏజెంట్‌గా కార్పొరేషన్ వ్యవహరిస్తోందని చెప్పారు. ఎకో టూరిజంకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనను అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో వారి సోదరుడు రామ్‌నాయన, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు రౌతు రామ్మూర్తి నాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విమాన ఇంధన పరిశ్రమ భూముల పరిశీలన

భోగాపురం: భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి విమాన ఇంధన పరిశ్రమను ఏర్పాటు చేయనున్న భూములను ఆర్డీఓ దాట్ల కీర్తి బుధవారం పరిశీలించారు. ఇంధన పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వం మండలంలోని అమటాం రావివలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 100, 101లలో హెచ్‌పీసీఎల్, జీఎంఆర్ సంస్థలకు సుమారు 7.8 ఎకరాలను కేటాయించింది. ఆ భూములను ఆర్డీఓ దాట్ల కీర్తి పరిశీలించి హద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి కాబోతోందని, అందుకోసం విమానాలకు కావలిసిన ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఇంధన పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్, జీఎంఆర్ సంస్థలతో చేసుకున్న ఎంఓయూ ప్రకారం వారికి భూములను అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో ఆమె వెంట తహసీల్దార్ ఎం.సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, హెచ్‌పీసీఎల్, జీఎంఆర్ సంస్థల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రైలు కింద పడిన వాసు మృతదేహం

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ బుధవారం తెలిపారు. మండలంలోని పత్తికాయవలస గ్రామానికి చెందిన రఘుమండ వాసు(54) మద్యానికి బానిసై అలవాటును దూరం చేసుకోలేక జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ప్రాణం తీసుకున్నట్లు హెచ్‌సీ చెప్పారు. బుధవారం ఉదయం విధుల్లో ఉన్న కీమేన్ ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: నెల్లిమర్ల, విజయనగరం రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ హెచ్‌సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సుమారు 40-45 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, చేతిపైన 'కె' అనే పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు శ్రీకాకుళం జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ ఫోన్ 9491106219 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ కోర్సులో మూడు నెలల శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి తెలిపారు. ఐటీఐ ప్రాంగణం లోని నైపుణ్య కేంద్రంలో శిక్షణ ఇచ్చే ఈ కోర్సుకు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి, ఇంటర్మీడియట్ ఆపై చదువుకున్న వారంతా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 6వ తేదీ లోగా ఐటీఐ ప్రాంగణానికి రావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 7780658035, 9849118075 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

6న కళా ఉత్సవ్ పోటీలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 6వ తేదీన జిల్లాస్థాయి కళా ఉత్సవ్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర, వాయిద్య సంగీతం, నత్యం, నాటకం, సంప్రదాయ కథలు చెప్పడం, దృశ్య కళలపై పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులు, జూనియర్ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు రవికుమార్ (79893 50244), సూర్యారావు(89199 85388), రామకృష్ణ (63016 14173)లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఉపాధ్యాయుడిపై విద్యార్థి దాడి



తల వెనుక గాయంతో ఉపాధ్యాయుడు,స్థానికులు

రామభద్రపురం: మతిస్థిమితంలేని ఓ ఎనిమిదో తరగతి విద్యార్థి ఉపాధ్యాయుడిపై మారణాయుధంతో దాడి చేయడం కలకలం రేపింది. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలంలోని కొండకెంగువ పంచాయతీ జుమ్మువలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సువ్వాడ అప్పలనాయుడుపై ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి వెంట తెచ్చుకున్న కత్తిపీటతో అకస్మాత్తుగా దాడి చేశాడు. స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న అప్పలనాయుడు మాస్టార్‌ను తానూ అటువైపే వస్తున్నానని, మీతో వచ్చేస్తాననడంతో రమ్మన్న ఉపాధ్యాయుడిపై దాడిచేశాడు. మాస్టారి తలపై కత్తిపీటతో దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటికే ఉపాధ్యాయుడు చలికాలం దృష్ట్యా మంకీ క్యాప్ పెట్టుకోవడంతో గాయాల తీవ్రత తగ్గిందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఉపాధ్యాయుడు పనిచేసిన ప్రాంతంలో విద్యార్థి అసభ్యకర మాటలు, ప్రవర్తనను ఇతర ఉపాధ్యాయులతో కలిసి అప్పలనాయుడు మాస్టారు కూడా వారించారు. సత్ప్రవర్తనతో మెలగాలని మందలించడాన్ని మనసులో పెట్టుకుని విద్యార్థి దాడికి పాల్పడ్డాడని భావిస్తున్నారు. ఇదే విషయమై అప్పలనాయుడు, ఆయన బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌లో పోలీసులపై కూడా ఆ విద్యార్థి దురుసుగా వ్యవహరించడంతో విద్యార్థి మానసిక స్థితి బాగాలేదని గుర్తించారు. అప్పటికే స్టేషన్‌లో విద్యార్థి కుటుంబసభ్యులకు విద్యార్థికి మానసిక చికిత్సలు అందజేయాలని ఎస్సై వెలమల ప్రసాదరావు సూచించారు. లేకుంటే మీపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అప్రమత్తతే ప్రధానం



ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు

విజయనగరం క్రైమ్: వీవీపీలకు వ్యక్తిగత భద్రత విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు సూచించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వీవీపీలతో పాటు తీవ్రవాదులు, మావోయిస్టుల నుంచి ముప్పు ఉన్న వ్యక్తులకు భద్రతా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పునశ్చరణ తరగతులు నిర్వహించారు. శారీరక దారుఢ్యం పెంపొందించుకోవడంతోపాటు, వీవీపీ సెక్యూరిటీలో నిర్వహించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైరింగ్ ప్రాక్టీస్, బాంబ్ డిస్పోజల్ విధులను అదనపు ఎస్పీ వివరించారు. రెండు రోజుల పాటు సాగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, పీఎస్ఓ ఆర్.శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల పరిశీలన

- ధాన్యం మిల్లు తనిఖీ
- పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాల ఎం.డి పర్యటన
- సత్కరించిన జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల ఎం.డి మంజీర్ జిలానీ

సీతానగరం: రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి నిర్దేశించిన 48 గంటల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు జమ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలానీ అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగరం మండలంలో రాష్ట్ర పౌరసరఫరాల మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలాని బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా అంటిపేటలో రైతుల కళ్లాల్లో వేసిన వరికుప్పలను పరిశీలించి ధాన్యం దిగుబడి, బిల్లులు చెల్లింపులు, వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు అందిస్తున్న సేవల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడున్న రైతు సేవాకాంద్రాన్నిసందర్శించి ధాన్యం కొనుగోలు, తేమశాతం నమోదు, రైతులకు డబ్బుల చెల్లింపు, ఇటీవల కురిసిన చిరుజల్లులకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ధాన్యం సేకరణపై ప్రశ్నలు వేశారు. క్షేత్రస్థాయిలో రైతుల గురించి కూడా పలు ప్రశ్నలు వేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందా? లేదా అని ఆరా తీశారు. తూకంలో ఏమైనా అధికంగా తీసుకుంటున్నారా? అనిరైతులను ప్రశ్నించారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోగా డబ్బులు తమ ఖాతాలో జమ అవుతున్న విషయాన్ని రైతులు తమ సెల్‌ఫోన్‌లో మెసేజ్ ద్వారా చూపించారు. జిల్లాలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్లు, ఇతర అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటు న్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక పౌరసరఫరాల శాఖ ఎం.డికి వివరించారు. ఈ ఏడాది ధాన్యంలో రైతు నేరుగా తనకు నచ్చిన మిల్లుకు సరుకు తరలించుకోవచ్చని మార్గదర్శకాలు విడుదల చేయడంతో మంచిఫలితాలు వస్తున్నాయని రైతులు తెలిపారు. జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన ఎం.డి మంజీర్ జిలానీకి జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, సబ్ కలెక్టర్ శ్రీ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు, మండల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి వై.విమల, తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వర రావు, ఏఓ ఎస్.అవినాష్, సీఎస్‌డీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి..

మండలంలోని తామరఖండి శ్రీవెంకట సూర్య మోడరన్ రైస్ మిల్లును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఎం.డి మంజీర్ జిలానీ పరిశీలించి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను, మిల్లింగ్ చేసిన బియ్యంలో నాణ్యతను పరిశీలించారు. ముందుగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అలాగే మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధాన్యం కొనుగోలులో 1:4 బ్యాంకు గ్యారంటీ సదుపాయాన్ని కల్పించాలని, గతంలో రావలసిన బకాయిలు చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో పూర్తి సహకారం అందజేస్తామని, రూ.100 కోట్ల బ్యాంకు గ్యారెంటీ కూడా చెల్లిస్తామని మిల్లర్లు తెలియజేశారు. కార్యక్రమంలో రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రవికుమార్, ట్రెజరర్ గెంబలి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్, ఎం.ధనుంజయ నాయుడు, అక్కేన మధు, కన్వీనర్ పొట్నూరు గౌరీ శంకర్రావు, కె.వెంకటరాజు, వారణాసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతు సేవాకేంద్రంలో ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు